# ఆమె ఇక రాదు

వెన్నకోట సుశీలాదేవి



సాయంత్రం అయిదున్నర గంటల సమయం!

కాలేజీ నుండి ఇంటికి వచ్చి తాళం తీసి లోపలకు అడుగుపెట్టాను.

కాలికి ఏదో తగిలినట్లయితే వంగి తీశాను!

గులాబీరంగు కవరు!

'ఎవరు చెప్మా' అనుకుంటూ చింపాను!

దాన్లో నుండి గులాబీరంగు కాగితం ఒకటి జారిపడింది.


మడత విప్పి చదువుకున్నాను.

దాన్లో రెండే వాక్యాలున్నాయి.

డియర్ శేఖర్‌గారూ,

నేను ఈ నెల 20వ తారీఖున ట్రాన్స్‌ఫర్ మీద మీ వూరు వస్తున్నాను. మీ అడ్రసు నా దగ్గర వుంది లెండి ... సరాసరి మీ ఇంటికే వస్తాను!

ప్రియంవద




కాగితం మరొకసారి చదువుకున్నాను.

సందేహం లేదు ...

ఆమే ...!

ఇన్నాళ్లకి – ఇలా వుత్తరం రాయడం నాకు ఎంతో ఆశ్చర్యాన్ని కల్గిస్తోంది.

ఆసలామెకు నా అడ్రస్సెలా తెలిసింది?

ఆమెకు దూరమై అయిదేళ్లపైన అయింది.

ఆమె నన్ను పూర్తిగా మర్చిపోయి వుంటుందనుకున్నాను.

కానీ ఆమె మర్చిపోలేదు.

నన్ను తల్చుకుంటూనే వుంది.

ఆమె మనస్సులో నేనున్నాను!

అలా అనుకోగానే అనిర్వచనీయమైన అనుభూతితో నా హృదయం పులకించిపోయింది.

ఒక్కసారిగా ఆమె జ్ఞాపకాలు నన్ను మేఘాల్లా ముసిరాయి. తట్టుకోలేక మంచం మీద వాలాను!

* * *

అవి నేను కాకినాడలో కొత్తగా లెక్చరరుగా చేరిన రోజులు!

ప్రియంవద వుమెన్స్ కాలేజీలో డిగ్రీ చదువుతుండేది. వాళ్లు మా ఇంటికెదురుగానే వుండేవారు. ఆమెకు తండ్రి లేడు. కొద్దిగా పొలం వుంది. స్వంత ఇల్లు వుంది. ఆ ఇంటిని అద్దెకిచ్చారు. వాటిపై వచ్చే ఆదాయంతో ఆమె తల్లి పొదుపుగా ఇల్లు గడిపేది.

ఒకరోజు వుదయం నేను కాలేజీకి వెడుతుండగా – "మాష్టారూ ..." అంటూ పిలిచింది.

నేను ఆగాను.

"మాష్టారూ! మీరు కాలేజీలో ఎకనామిక్స్ లెక్చరరుట కదా! నాకు నిన్ననే తెలిసింది. మీ దగ్గర సెకండ్ ఇయర్ డిగ్రీ నోట్సు వుంటే ఒకసారి ఇస్తారా?" అంటూ చకచకా మాట్లాడేసింది.

"ఓ ... వుంది..." అన్నాను.

"సాయంత్రం మీ ఇంటికొచ్చి తీసుకుంటాను" అని వెళ్లిపోయింది.

ఆ సాయంత్రం నోట్సు తీసుకుంటూ – "మాష్టారూ! ఎకనామిక్స్‌లో అర్థంకాని టాపిక్స్ వున్నాయి. కాస్త చెప్తారా" అనడిగింది చొరవగా.

నేను ఆశ్చర్యపోతూ ... "అలాగే ..." అన్నాను.

ఆ తర్వాత ఆమె తరుచూ నా గదికొచ్చేది! తెలియని విషయాలు చెప్పించుకునేది.

ప్రియంవదకి చురుకతనం ... ఎక్కువ ... ఎకనామిక్స్ పాఠాలు చెప్పే సమయంలో తప్ప – మిగతా వేళల్లో నేనే శ్రోతని – ఆమే వక్త.

ఎన్నో విషయాల గూర్చి అనర్గళంగా మాట్లాడేది! ఆమె లోకజ్ఞానానికి ఆశ్చర్యపోతుండేవాడిని!

మరో ఆర్నెల్లు గడిచాయి.

నాకున్న ఒకే ఒక రక్తబంధువు మా మావయ్య ఒకరోజు వచ్చి – "ఒరేయ్! శేఖరం! మంచి సంబంధం ఒకటి వచ్చింది ... నీకిష్టమైతే సెటిల్ చేస్తా" అన్నాడు!

పెళ్లి అనగానే నా మనస్సులో ప్రియంవద మెదిలింది.

ఆమెను చేసుకుంటే ...

ప్రియంవద సన్నగా – తెల్లగా – విద్యుద్వల్లిలా వుంటుంది.

నాకు లేని చొరవ... మాటకారితనం ఆమెలో

**నవ్వి**

"నల్ల రక్తం వుండే దెవరికిరా రామూ?" అడిగాడు మాస్టారు.

"బ్లాక్ మార్కెట్ చేసేవారికండి!" వెంటనే చెప్పాడు రాము.

— పి.ఆర్. బద్దిగం

వున్నాయి. అన్నిటికి మించిన లోకజ్ఞానం వుంది. ఆమే నాకన్నివిధాలా తగింది. ఆమె ఒప్పకుంటే అదృష్టవంతుడినే అనుకున్నాను.

మావయ్యకి ఏదో సర్దిచెప్పి పంపేశాను.

'ప్రియంవదని ఎలా అడగాలా' అనుకుంటుం డగానే ప్రియంవద పరీక్షలైపోయాయి.

ఆమె మళ్లీ కనబడదేమోననే భయంతో చివరి రోజు – ధైర్యం చేసి అడిగేశాను.

ఆమె క్షణకాలం బిత్తరపోయింది.

"మాస్టారు! మీరు నన్ను పెళ్లి చేసుకుంటారా?"

"ఏం నేను తగనా?"

"ఛ! నాకే అర్హత లేదు... మీరెక్కడ! నేనెక్కడ?"

నేను నవ్వేస్తూ "పెళ్లయితే మనిద్దరం ఇక్కడే వుందాం" అన్నాను.

తలొంచుకుంది.

"అయితే త్వరలోనే మన పెళ్ళి ..."

"కానీ..." అర్థోక్తిలో ఆగింది

"ఏమిటో చెప్ప ప్రియా!"

"నా తమ్ముళ్లు చిన్నవాళ్లు – వాళ్ల బాధ్యత నాపై వుంది."

"అయితే..."

"కొన్నాళ్లపాటు వుద్యోగం చేసి వాళ్లనొకదారి లోకి తెచ్చాక పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను" అంది.

ఆమె మాటలు నాకు చిరాకు కల్గించాయి..

"తమ్ముళ్ల వుద్యోగం – చెల్లెలి పెళ్లి ఈ బాధ్యతలు ఇప్పట్లో తీర్తాయా! అప్పటివరకూ పెళ్లి వాయిదా వేయడం మూర్ఖత్వం ..." అన్నాను.

"నేనా విధంగా మా అమ్మకు మాటిచ్చానండీ."

"అయితే వాళ్లకోసం నీ సుఖాల్ని త్యాగం చేస్తావా? నాకంటే వాళ్లే ఎక్కువా?" కొంచెం కోపంగా అన్నాను.

"ఇందులో ఎక్కువ తక్కువలేవున్నాయ్యండీ! అది నా బాధ్యత ... నెరవేర్చక తప్పదండీ" మెల్లగానైనా దృఢంగా చెప్పింది.

నాకు ఒళ్లు మండిపోయింది.

నావంటి వ్యక్తి కోరి వరిస్తే బాధ్యతలంటూ ఏవేవో మాట్లాడుతోంది. ఎవరి కోసమో తన జీవితాన్నెందుకు నాశనం చేసుకోవాలి? నాకటువంటి అనవసర త్యాగాలంటే అసహ్యం ... మనకోసం మనం జీవించాలి ... అంతే ... అదే చెప్పాను.

మళ్లీ కనబడలేదు.

ఆ తర్వాత నెలలో నేనా వూరునుండి ట్రాన్స్ ఫర్ చేయించుకున్నాను. కానీ ఆ వూరునుండి వచ్చాక కానీ ప్రియంవదని నేనెంత ప్రేమించానో తెలీలేదు...

ప్రతిక్షణం ఆమే గుర్తుకు వచ్చేది.

ఆమెమాటలు, నవ్వు మర్చిపోవడం నాకసాధ్యమైపోయింది. మనస్సు మళ్లించుకోవాలని పి.హెచ్ డిలో చేరాను. ఆ వర్కులో మునిగిపోయి ప్రియంవదని తాత్కాలికంగా మర్చిపోగల్గాను.

రీసెర్చి పూర్తయి – డిగ్రీ అందుకుంటున్న సమయంలో మళ్లీ ప్రియంవద రాక ...

అడవిలోకి వసంతం వచ్చినట్లుగా వుంది. 'ప్రియంవదని ఇక శాశ్వతంగా నా దగ్గరే వుండేట్లు చేసుకోవాలి' అనుకున్నాను.

* * *

"ఏమిటి గురూగారూ! చాలా వుషారుగా వున్నారు?"

నేను వేసుకున్న కొత్త సూటును చూస్తూ అడిగాడు నా కొలీగ్ రాఘవ.

మా డిపార్టుమెంటులోకి ఇటీవలే వచ్చి చేరాడు. ప్రతి చిన్న విషయంలోనూ నా సలహా అడుగుతుంటాడు. అతడు నన్ను 'గురూగారూ' అని సంబోధించినా మా ఇద్దరి మధ్యా స్నేహమే ఎక్కువ.

అతని ప్రశ్నకు నవ్వేస్తూ –

"ఇవ్వాళ మా ప్రియంవద వస్తోందోయ్" అన్నాను.

"అంటే ... ఎవరండీ" అన్నాడు.

"ఏం చెప్పను. నా జీవితాన్ని వెలిగించే దీపకళిక ... అయిదేళ్లయింది ఆమెని చూసి ..." అంటూ జరిగింది చెప్పాను.

"అయితే అయిదేళ్లనుండీ ఆమెని ధ్యానిస్తూ ఒంటరి జీవితం గడుపుతున్నారన్న మాట..."

"అవునోయ్! ఆమె వెళ్లిపోయాకగానీ – ఆ ప్రేమ విలువ తెలీలేదు."

"గురూగారూ! ఇన్నేళ్లు మీరిద్దరూ ఒకరి కోసం ఒకరు వేచివున్నారంటే చాలా గొప్ప విషయం..." అన్నాడు అబ్బురంగా.

"రాఘవా! ఇప్పడామె బాధ్యతలన్నీ తీరిపోయి వుంటాయి! అందుకే రెక్కలు కట్టుకుని నా దగ్గరకు వస్తోంది! ఇక ఆమెను నా గుండెల్లో శాశ్వతబందీ చేస్తాను" అన్నాడు ఆవేశంగా.

రాఘవ నవ్వాడు!

* * *

ప్రియంవద వచ్చింది!

నా చీకటింట్లోకి వెలుగు కిరణం ప్రసరించింది.

నా ఇల్లు ఆమె మాటల్తో – నవ్వుల్తో కళకళలాడిపోయింది.

వచ్చిన మర్నాటినుండీ నా ఇంటి బాధ్యతంతా మీద వేసుకుంది.

రకరకాల వంటలు చేసేది!

"ఏమిటండీ ఈ తినడం – ఇలా తిని క్లాసులో పాఠాలేం చెప్తారు?"

అంటూ కొసరి కొసరి వడ్డించేది.

"ఇల్లంతా చిందరగా వుంది! పుస్తకాలు చదువుకోవడమే కానీ – ఇల్లు సర్దుకోవడం తెలీదు కదా' ' అంటూ ఇంటిని అందంగా అలంకరించింది.

ప్రియంవద చేతి భోజనం చేస్తూ – ఆమె మాటలు వింటూ రోజులు క్షణాల్లా గడిపేస్తున్నాను.

రాఘవకి ప్రియంవదని పరిచేయం చేశాను.

"మీరు చాలా అదృష్టవంతులు గురూగారూ" అన్నాడు.

ఆ ఒక్క మాటతోనే ఆమెనెంతో పొగిడినట్లయింది.

"గురూగారూ! ఇంకా ఆలస్యం దేనికండీ. త్వరలో వివాహం చేసుకోండి... సార్."

రాఘవ తొందర పెట్టసాగాడు.

ఒక సాయంత్రం – ఆమె తన తమ్ముళ్ల గురించి చెప్తుండగా –

"ప్రియా! ఇక నీ బాధ్యతలు తీరాయి కదా! ఇప్పటికైనా ఈ దీనుడిని కనికరిస్తావా?" అనడిగాను.

ప్రియంవద సిగ్గుపడుతూ "నాదేముంది ... మీ ఇష్టం"

నా ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి.

ఇక ప్రియంవద నా స్వంతం. "రేపు మా పెళ్లయ్యాక మా జంటని చూసి ఎందరు అసూయపడ్తారో? ఆలస్యంగానైనా అమృతభాండాన్ని అందుకోబోతున్నాను" అనుకుంటూ గర్వించాను.

మర్నాడే రిజిష్ట్రారాఫీసులో అప్లికేషన్ పెట్టాను.

రాఘవ పెళ్లిపెద్దలా అన్ని ఏర్పాట్లు చూస్తున్నాడు.

బట్టలు, నగలు కొన్నాను. నా బంధువులందరికీ వుత్తరాలు వ్రాశాను.

అంతా సిద్ధమైంది.

మరో వారం రోజుల్లో పెళ్లి వుందనగా – ఒకరోజు సాయంత్రం నేను కాలేజీనుండి రాగానే ప్రియంవద నాకొక వుత్తరం అందించింది.

దాన్లో ఇలా వుంది.

డియర్ ప్రియా ...

పిల్లలు నీ కోసం బెంగపెట్టుకుని జ్వరం తెచ్చుకున్నారు ... వెంటనే వచ్చి వాళ్లను తీసుకెళ్లు."

ఇట్లు
భానుమతి

వుత్తరం మడిచి ప్రియంవద ముఖంలోకి

చూశాను.

"పాపం ... పసివాళ్లు ఎలా వున్నారో?"

విచారంగా అంటోంది.

"ఎవరీ పిల్లలు?" అనడిగాను అనుమానంగా.

"నా కొలీగ్ పిల్లలు. ఆ పిల్లల తల్లీ తండ్రీ ఇద్దరూ ఏక్సిడెంట్‌లో చనిపోయారు. ఏడేళ్ల పాప, అయిదేళ్ల బాబు అనాథలైపోయారు. వాళ్లకెవ్వరూ లేరు. ఇక నేను చూస్తూ వూరుకోలేకపోయాను. ఆ పసివాళ్లను నేనే పెంచుకుంటున్నాను. ఇప్పటివరకూ వాళ్లకు తల్లీ తండ్రీ అన్నీ నేనే. రేపు మన పెళ్లయ్యాక నేను అమ్మ – మీరు నాన్న" నవ్వింది ప్రియంవద.

నేను నవ్వలేదు.

"వాళ్లిక మనతోటే వుండాలా?" అనడిగాను.

"అవును ... లేకపోతే ఏమయిపోతారు?"

"ప్రియా నీ చెల్లెలికి పెళ్లయి – నీ తమ్ముళ్లు ఉద్యోగస్తులయ్యారంటే నీ బాధ్యతలు తీరాయని సంతోషిస్తున్నాను. మళ్లీ ఈ కొత్త బంధాలేమిటి?" అన్నాను చిరాగ్గా.

"అదేమిటండీ! మనం వదిలేస్తే ఆ పసివాళ్లేమవుతారు?" అంది కొంచెం బాధగా.

కానీ నేను అదేమీ పట్టించుకునే స్థితిలో లేను.

ప్రియంవద ప్రవర్తనకు మంటెక్కిపోతోంది.

"బోలెడు అనాథాశ్రమాలున్నాయి" అన్నాను కరుగ్గా.

ప్రియంవద మాట్లాడలేదు.

ఆమె ముఖం చూసి చప్పన తగ్గిపోయి ... మెల్లగా చెప్పాను!

"ప్రియా! ఇన్నేళ్ల తర్వాత కలిశాం. ఇకనైనా మనం హాయిగా జీవించాలి. మనకు ఏ బరువులూ – సంకెళ్లూ వద్దు. వాళ్లని వదిలించుకో. పెళ్లయితే మనకీ పిల్లలు పుడ్తారు కదా. ఈ పిల్లల్ని కూడా ఎలా పెంచగలం. వీళ్లని ఏ అనాథ శరణాలయంలోనో చేర్చు. అందరి గురించీ ఆలోచించి జీవితాన్ని పాడుచేసుకోవడం మంచిది కాదు... మన సుఖాల గురించి ఆలోచించు ..."

నా మాటలు పూర్తికాకుండానే ప్రియంవద తన గదిలోకి వెళ్లి తలుపేసుకుంది.

నా మనస్సు వికలమైపోయింది.

ప్రియంవద ఎందుకిలా లేనిపోని బాధ్యతలని తలకెత్తుకుంటుంది? ఛ. జీవితాన్ని హాయిగా గడపడం చేతకాదు. మనిషి తన గురించే ఆలోచించుకోవాలి. అందరి గురించీ పట్టించుకుంటే ... ఈ కాస్త బ్రతుకూ తెల్లారిపోతుంది. ప్రస్తుతం ప్రియంవద కోపంలో వుంది. రేపు తీరుబడిగా ఆమెకు నచ్చచెప్పి ... వాళ్లను వదిలించుకోవాలి' అనుకుంటూ నిద్రపోయాను.

తెల్లారింది!

ఎప్పటిలా ఆమె కాఫీ కప్పలే మేల్కొల్పులు పాడలేదు. నేను కంగారుగా లేచి ఆమె గదిలోకి వెళ్లాను.

మంచం మీద పేపరు వెయిట్ క్రింద కాగితం ఒకటి కనబడింది.

ఆత్రంగా తీసుకుని చదివాను.

శేఖర్‌గారూ

మీరు మారారనుకున్నాను! కానీ కాలం మీలో ఏ మార్పూ తీసుకురాలేదు. పైగా ఇంకా ఎక్కువ స్వార్థంతో కరడుకట్టుకుపోయారు. స్వసుఖాలే తప్ప ఇతరుల గురించి ఆలోచించని మీతో జీవితం నరకప్రాయం. నాకా జీవితం వద్దు."

సెలవ్...

ప్రియంవద...

ఆ వుత్తరం చదవగానే నా మనసు నీరయిపోయింది.

ప్రియంవద అన్నట్లు 'నేను స్వార్థపరుడినా?'

ఏమో!

ఏదయితే ఏం – ప్రియంవద నాకు అంతులేని వేదనని మిగిల్చి – మరోసారి నా జీవితంలో నుండి నడుచుకుంటూ వెళ్లిపోయింది.

ఇక ఆమె ఎప్పటికీ తిరిగిరాదు!


సెక్స్‌లో బలహీనత, సుఖవ్యాధులు (S.T.D)



దురభ్యాసముల వలన కల్గిన బలహీనత,
రతి మధ్యలో అసంతృప్తి, లేపనశక్తి
తగ్గిపోవుట, శీఘ్రస్ఖలనము, మానసిక
ఆందోళనలకు శాస్త్రీయ చికిత్స. ఆయుర్వేద
ఇంజెక్షన్లు, కరంటుతో ప్రత్యేక చికిత్స.
పోస్టు ద్వారా సంప్రదించువారు
రు1/- పోస్టల్ కవరు పంపవలెను.

డాక్టర్. పి.వి.కె. రావ్-సెక్స్ థెరపిస్ట్,
వైద్యా చార్య-వైద్య విద్వాన్.

ట్రావెలర్స్ బంగళా రోడ్,
తెనాలి - 522 201
ఫోన్స్ 3700, 4010